ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



రూ.145 కోట్లతో మెగా మిల్క్ డెయిరీ

8

- కొలగల్లు వద్ద ఏర్పాటుకు కేఎంఎఫ్ బోర్డు తీర్మానం
- స్థలాన్ని పరిశీలించిన పాలకులు, అధికారులు
- శంకుస్థాపనకు రానున్న సీఎం, డీసీఎం



రాజ్యాంగ పుస్తకం చూపుతున్న రాహుల్ గాంధీ

ఓట్ల చౌర్యం.. పక్కా నిజం



- రాజ్యాంగం సాక్షిగా చెబుతున్నా...
- ఓటరు జాబితాలో గందరగోళం వాస్తవం
- పార్లమెంటులో ప్రమాణం చేశా...
- అఫిడవిట్ ఎందుకో?
- ప్రతిపక్షాలకు ఓరోజు వస్తుంది..
- ఈసీ అధికారులకు వాస్తవాలు తెలుస్తాయి
- డిజిటల్ జాబితా ఇవ్వకుంటే పోరాటమే
- 'ఓట్ అధికార్ ర్యాలీ'లో రాహుల్‌గాంధీ
- ఆరోపణలను ఖండించిన బీజేపీ

బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం సాక్షిగా నేను చెప్పేవన్నీ వాస్తవాలు, ఓటరు జాబితా చేర్పుల్లో గందరగోళం జరిగిందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అభిప్రాయపడ్డారు. 'ఓట్ అధికార్ ర్యాలీ' పేరిట నగరంలోని ఫ్రీడంపార్కులో శుక్రవారం 'మన ఓటు మన హక్కు మన పోరాటం' నినాదంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. రెండు గంటలు ఆలస్యంగా వేదికకు చేరుకున్న రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్, బీజేపీ ప్రభుత్వంపై తిరగబడ్డారు. ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటకలో ఓట్ల చౌర్యం జరిగిందని ప్రస్తావించారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం మహదేవపురలో ఓట్ల చౌర్యానికి సేకరించానన్నారు. శాసనసభ ఎన్నికలకు లోక్‌సభ ఎన్నికలకు మధ్య కొన్ని నెలలు తేడా ఉన్నా లక్షలాది ఓట్లు మార్పులు, చేర్పులు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి సంబంధించి మహదేవపుర శాసనసభ ప్రాంతంలో మాత్రమే గణాంకాలతో ఆధారాలు సేకరించామన్నారు.



వేదికపై కాంగ్రెస్ అగ్రనేతలు

మహదేవపురలో లక్ష దొంగ ఓట్లు: రాహుల్

మహదేవపుర పరిధిలో 6.5 లక్షలు ఓటర్లు ఉండగా, లోక్‌సభ ఎన్నికలకు ముందు లక్ష చేరాయని వీటిపైనే అనుమానం అన్నారు. ఈ ప్రాంతంలో ప్రతి ఆరు ఓట్లకు ఒక దొంగ ఓటు ఉందన్నారు. ఒకే వ్యక్తి ఇక్కడ నాలుగైదు చోట్ల ఓటు ఉందని, వీరికే లఖ్‌నవ్, వారణాసి ప్రాంతాల్లో కూడా ఓటు హక్కు ఉందన్నారు. ఓటరు జాబితాలో నమోదుకు ఫారం 6 సమగ్రంగా ఉన్నాయా..? అని ప్రశ్నించారు. తప్పుడు చిరునామాలతో ఓట్లు నమోదు చేశారన్నారు. ఒకే ఇంట్లో 30-40 ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. నకిలీ ఓట్లతో కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లోనూ ఓటు వేస్తారన్నారు. ఓట్ల చౌర్యంపై ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నిస్తే అఫిడవిట్ ఇవ్వాలని కోరుతారన్నారు. పార్లమెంటు ముందు ప్రతిజ్ఞ చేశానని, రాజ్యాంగం సాక్షిగా చెబుతున్నా అని నా వ్యాఖ్యలు సత్యమైనవన్నారు. దేశ ప్రజలు అక్రమాలను ప్రశ్నించే రోజు వచ్చిందన్నారు. సమయం వచ్చినప్పుడు అన్ని వెలుగులోకి వస్తాయన్నారు. నరేంద్రమోదీ కేవలం 25 సీట్ల తేడాతోనే ప్రధానమంత్రిగా కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుతం ఒక నియోజకవర్గంపై అక్రమాలను గుర్తించామని, మేం అడిగిన రికార్డులు ఇవ్వకపోయినా, మా ప్రశ్నలకు సమాధానం లేకున్నా, 25 నియోజకవర్గాలపైనా సమగ్ర సర్వే చేస్తామన్నారు. ఓటరు జాబితా డిజిటల్ రూపంలో ఇచ్చేందుకు ఎందుకు అభ్యంతరమన్నారు. పోలింగ్ రోజున సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను 45 రోజుల్లోనే తొలగించారన్నారు. బీజేపీ రాజ్యాంగతత్వసిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు. అందుకే ఐదు ప్రశ్నలు వేస్తున్నామని, వాటికి సమాధానం చెప్పాలన్నారు. డిజిటల్ ఓటరు జాబితా ఎందుకు ఇవ్వడం లేదన్నారు. పోలింగ్ రోజుకు సంబంధించి సీసీటీవీ, వీడియోలను ఎందుకు ఇవ్వరన్నారు. నకిలీ ఓట్ల జాబితాను ఎందుకు చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులను ఎందుకు బెదరిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీ ఏజెంట్‌గా మారిందా..? అంటూ ప్రశ్నించారు.




ప్లకార్డులతో కార్యకర్తలు

ప్రధాని రాజీనామా చేయాలి : సీఎం సిద్దరామయ్య



లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చౌర్యం జరిగిందని, నరేంద్రమోదీ ప్రధాని కుర్చీలో కొనసాగే నైతికత లేదని వెంటనే రాజీనామా చేయాలని సీఎం సిద్దరామయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ బీజేపీ బ్రాంచ్ ఆఫీస్‌గా మారిందన్నారు. కర్ణాటక నుంచి ప్రారంభమైన ఓట్ల చౌర్యం పోరాటం దేశవ్యాప్తంగా విస్తరిస్తుందన్నారు. రాహుల్‌గాంధీ సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజల ముందు వాస్తవాలు ఉంచారన్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ నిబంధనలకు లోబడి న్యాయబద్ధంగా కొనసాగాలన్నారు. ఓటు ప్రతి మనిషి ప్రాథమిక హక్కు అని, నాశనం చేయడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగరక్షణ పోరాటానికి సిద్ధమయ్యారని రాష్ట్రప్రజలు అందుకు సంపూర్ణమద్దతు ఇస్తారన్నారు.

ప్రజాస్వామ్య రక్షణే మా కర్తవ్యం: ఖర్గే



దేశంలో ప్రజాస్వామ్య రక్షణ మా కర్తవ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే నరేంద్రమోదీ, అమిత్ షాలు ప్రజలు మద్దతు ఇవ్వకున్నా ఓట్ల చౌర్యం ద్వారా ఎన్నికలలో గెలిచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది దొంగ ప్రభుత్వమని, కొనసాగే హక్కు లేదన్నారు. దేశాభివృద్ధికి పాటుపడుతున్నా అని ప్రధాని చెప్పడం అబద్ధమన్నారు. ఎన్నికల అక్రమాలపై అన్ని రాష్ట్రాల్లోనూ వెలికితీస్తామన్నారు. 12 ఎన్నికల్లో గెలిచిన నేను 2019 ఎన్నికల్లో ఓడినప్పుడే అనుమానం వ్యక్తం చేశానన్నారు. అప్పట్లో మాకు తెలియరాలేదన్నారు. ప్రధాని మోదీ ఈడీ, సీబీఐ, ఐటీ ద్వారా బెదరింపులకు పాల్పడి పాలన సాగిస్తున్నారన్నారు. 1942 ఆగస్టు 9న మహాత్మాగాంధీ క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించారని మనం రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణకు అదే తరహా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

ఉత్సాహం నింపిన 'ఓట్ అధికార్ ర్యాలీ'

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఓట్ అధికార్ ర్యాలీ పార్టీ కార్యకర్తలలో ఉత్సాహం నింపింది. దాదాపు పదిరోజులుగా సాగిన కసరత్తుకు అనుగుణంగా ప్రజలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఫ్రీడంపార్కులో ఏర్పాటు చేసిన నిరసనకు రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలనుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ప్రధానంగా బెంగళూరు చుట్టుపక్కల 11 జిల్లాలనుంచి భారీగా కార్యకర్తలు వచ్చారు. ఓవైపు వరమహాలక్ష్మి వ్రతం ముఖ్యమైన పండుగ అయినా మహిళలు సైతం వచ్చారు. అధికార పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమం కావడంతో భారీ పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. మైసూరు బ్యాంకు, చాళుక్య సర్కిల్, మౌర్య సర్కిల్, తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిపివేయడంతో నగరంలోని ప్రధాన ప్రాంతాలలో దీని ప్రభావం కనిపించింది. 2వేలమందికిపైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీఎం డీకే





ఫ్రీడం పార్క్ వద్ద వాహనాల రద్దీ

సభకు హాజరయిన కార్యకర్తలు

వినతి ఇవ్వకుండానే వెనుదిరిగిన రాహుల్

- ఆలస్యంగా ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఓట్ల చౌర్యం జరిగిందని భారీ నిరసన సభ నిర్వహించిన రాహుల్‌గాంధీ ముందుగా ప్రకటించినట్లు ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం మహదేవపుర పరిధిలో ఓట్ల చౌర్యం జరిగిందని, రాహుల్‌గాంధీ ఢిల్లీలో ఇటీవల ఆరోపించారు. మహదేవపుర నుంచి పాదయాత్ర చేపట్టి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి చేరుకుని వినతి ఇచ్చేలా కార్యక్రమం రూపొందించారు. అయితే పాదయాత్రలో ఇబ్బందులు ఉంటాయని, కేవలం ఫ్రీడం పార్కులో నిరసన చేపట్టి అక్కడనుంచి సమీపంలోనే ఉన్న రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లి వినతి ఇచ్చేలా షెడ్యూల్ ప్రకటించారు. కానీ వాటన్నింటినీ రాహుల్‌గాంధీ పాటించలేదు. సభ ముగియగానే ఎన్నికల కమిషన్ కార్యాలయానికి పాదయాత్రగాగానీ, వాహనాల్లోగానీ వెళ్లలేదు. పైగా రాష్ట్ర డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పేరిట చేసిన వినతి పత్రాన్ని సభ ముగిసిన రెండు గంటల తర్వాత రాష్ట్రనాయకులు కొందరు ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని ఇచ్చారు. అందులోనా సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలాలు సంతకం చేశారు. రాహుల్‌గాంధీ సంతకం లేకుండానే వినతిపత్రం ఇచ్చారు. ఎన్నికల కమిషన్ సదరు వినతికి వివరణ ప్రకటించింది. వినతిపత్రానికి అనుబంధంగా ఎటువంటి ఆధారాలు సమర్పించలేదని స్పష్టం చేసింది.



ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేస్తున్న డీసీఎం డీకే

బీజేపీకి ఓట్లు పెరిగితే అనుమానం ఎందుకు?

- మహదేవపురలో అక్రమాలు లేవు
- రాహుల్ గాంధీపై స్థానిక బీజేపీ నేత, మాజీ మంత్రి అరవింద లింబావళి మండిపాటు

బెంగళూరు, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గంలో బీజేపీకి ఓట్లు పెరిగితే రాహుల్‌గాంధీకి అనుమానం ఎందుకు వచ్చిందని స్థానిక ఎమ్మెల్యే మంజుళ భర్త, మాజీ మంత్రి అరవింద లింబావళి ప్రశ్నించారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహదేవపురలో అక్రమాలు జరగలేదన్నారు. తమ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ఇంతకాలం రాహుల్‌గాంధీ ఈవీఎంలపై ఆరోపణలు చేశారని, ఇప్పుడు కొత్తగా ఓట్ల చౌర్యంపై అంటూ తెరమీదకు తెచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో మహదేవపురపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేసిన రాహుల్ గాంధీ 40,009 ఓట్లు నకిలీవిగా తెలిపారన్నారు. ఒకే చిరునామాతో 10,452 ఓట్లు ఉన్నాయని ఆరోపించారన్నారు. వాస్తవాన్ని పరిశీలించామన్నారు. గురుకిరీట్‌సింగ్ అనే వ్యక్తి నాలుగుసార్లు ఓటరు జాబితాలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందుకు వేర్వేరు చోట కనిపించిందన్నారు. మూడుచోట్ల ఓటు తొలగించాలని వినతి ఇచ్చారన్నారు. లఖ్‌నవ్‌కు చెందిన ఆదిత్య శ్రీవాత్సవ్ 19ఏళ్ల వయసులో లఖ్‌నవ్‌లో ఓటరు జాబితాలో చేరారన్నారు. ఆ తర్వాత ఉద్యోగరీత్యా ముంబైలో ఉన్నప్పుడు అక్కడ ఓటరుగా చేరారన్నారు. ఇటీవల కొన్నేళ్లుగా బెంగళూరుకు వచ్చినప్పుడు ఫారం 7 ద్వారా దరఖాస్తు చేసుకున్నారన్నారు. నకిలీ చిరునామాతో ఓటరుగా చేరేందుకు ప్రయత్నిస్తే కమిషన్ తిరస్కరించిందన్నారు. 2008లో మహదేవపుర నియోజకవర్గం ఏర్పడిందని, అప్పుడు 2.75 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, 2009 లోక్‌సభ ఎన్నికల నాటికి 3.14లక్షలమంది అయ్యారన్నారు. 2013 శాసనసభ ఎన్నికలనాటికి 3.68 లక్షలకు పెరిగారన్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో 6.07 లక్షల మంది ఓటర్లు కాగా వారిలో 3.29 లక్షలమంది ఓటు వేశారని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 6.59 లక్షలమంది ఓటర్లు ఉండగా 3.51 లక్షలమంది ఓటు వేశారన్నారు. మూడుసార్లు లోక్‌సభ ఎన్నికలలో లక్షకుపైగానే ఓట్లు నమోదయ్యాయన్నారు. మహదేవపుర అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, ఐటీతోపాటు భిన్నమైన పరిశ్రమలు ఇదే ప్రాంతంలో ఉన్నందున ఎక్కువమంది వలస వచ్చేవారు ఉన్నారన్నారు. చామరాజపేట, శివాజినగర్‌లలోనూ డబుల్ ఎంట్రీలు ఉన్నాయని, అక్కడ కూడా ఓట్ల చౌర్యం జరిగిందా..? అంటూ ప్రశ్నించారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

యువకుల ఆసక్తి అభినందనీయం

- ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్
- ప్రారంభమైన అగ్నివీర్ నియామక ర్యాలీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాటిల్

7



కోననకుంటె మహాలక్ష్మికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఇంటింటా వరమహాలక్ష్మి సందడి

బెంగళూరు, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో తొలి పండుగ వరమహాలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం ఇంటింటా సందడిగా జరిగింది. వరమహాలక్ష్మిని కొలవడం ద్వారా అన్ని విధాలా శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం. రెండు మూడు రోజులుగా మార్కెట్‌లలో కొనుగోలు చేసిన పూలు, పండ్లు పత్రులతో వరమహాలక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి ఇంటింటా పూజలు చేశారు. వ్రతం ఆచరించి వాయనం ఇచ్చిపుచ్చుకున్నారు. పలు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాలలోనూ విశేషపూజలు కొనసాగాయి. పుట్టేనహళ్ళి, కోననకుంటె మహాలక్ష్మి ఆలయాలతోపాటు గొరవనహళ్ళి మహాలక్ష్మి ఆలయంలోనూ భక్తుల సందడి నెలకొంది.



పుట్టేనహళ్ళిలోని ఆలయంలో భక్తుల సందడి



రజత కవచ ధారణలో అమ్మవారు

ముత్తుమారియమ్మన్‌కు విశేష పూజలు

హోసూరు, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): వరమహాలక్ష్మి పండుగ సందర్భంగా నగరంలోని అమ్మవారి ఆలయాలలో విశేషపూజలు కొనసాగాయి. బెంగళూరు-హోసూరు రహదారిపై వెలసిన ముత్తుమారియమ్మన్ అమ్మవారు రజతకవచధారణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దర్మకర్త వెంకటేశ్, ఛైర్మన్ రంగన్నబాబు పర్యవేక్షించారు.



స్నేహితులతో కలిసి మొక్క నాటుతున్న నవని (స్కూల్ యూనిఫాంలో ఉన్న చిన్నారి)

అవని కోసం నవని..!

చిన్నారి పర్యావరణ ప్రేమ

257 మొక్కలు నాటిన అనంత బాలిక

● 3 వేల మొక్కల పంపిణీ ● వాటి సంరక్షణకు చర్యలు ● కేంద్ర మంత్రి ప్రశంసలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మూడో తరగతి చదువుతున్న బాలిక పర్యావరణ పరిరక్షణకు కదిలింది. మొక్కలు నాటుతూ, వాటిని పరిరక్షిస్తూ అందరి మన్ననలు పొందుతోంది అనంతపురానికి చెందిన నవని. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2024 జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏక్ పేడ్ మా కె నామ్ (తల్లి పేరుతో మొక్క నాటుదాం) అంటూ ఇచ్చిన పిలుపు పట్ల ఆకర్షితురాలై మొక్కలు నాటడంతో పాటు ఉచితంగా వాటిని పంపిణీ చేస్తోంది. ఇప్పటివరకు 257 మొక్కలు నాటి వాటిని స్వయంగా పరిరక్షిస్తోంది. 3 వేల మొక్కలు పంపిణీ చేసి, వాటిని ఎక్కడెక్కడ నాటారనే అంశాలపై తరచూ ఆరా తీస్తూ వాటి పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తోంది.

మూడో తరగతి బాలిక.
పసి వయసులోనే
పర్యావరణంపై ప్రేమ పెంచుకుంది.
భూమి పరిరక్షణకు
చిరు ప్రయత్నం మొదలెట్టింది.
పచ్చదనం పెంచేందుకు కదిలింది.
వందల మొక్కలు నాటింది..
వాటిని పరిరక్షిస్తోంది.. వేలల్లో
పంపిణీ చేసింది..
అవి ఎలా ఉన్నాయని ఆరాతీస్తోంది..
పచ్చని చెట్లపై ఎంత
పిచ్చి ప్రేమో..
ఆ పసి
పాపకి..



నవనిని అభినందిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

నరేంద్ర మోదీ పిలుపుతో..

నగరానికి చెందిన అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, కల్పన దంపతుల ఏకైక కుమార్తె నవని. అనంతపురంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో మూడో తరగతి చదువుతోంది. తండ్రి సుంకర రమేష్ ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి పొందింది. చిన్నతనంలోనే సేవాబాట పట్టింది. మొక్కల పరిరక్షణకు అనువుగా, అవకాశం ఉండే ప్రాంతాలను ఎంచుకుంటోంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, పార్కుల్లో మొక్కలు నాటడం మొదలెట్టింది. పండుగలు, సెలవు రోజుల్లో మొక్కలు నాటుతోంది.

కేంద్ర మంత్రుల అభినందనలు

చిన్నారి నవని చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. నవని మొక్కలు నాటడం, ఉచితంగా పంపిణీ చేయడంపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను కేంద్రప్రభుత్వం గుర్తించింది. నవనిని మేరా సర్కార్ అధికారులు ఢిల్లీకి ఆహ్వానించారు. అక్కడికెళ్లి నవని చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అవనిని కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి సతీష్‌చంద్ర దూబే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, టీడీపీ పార్లమెంటు ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు. ఏక్ పేడ్ మా కె నామ్ అమలులో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపై ఢిల్లీలోని జేఎన్‌యూ విద్యార్థులతో ప్రధానమంత్రి మోదీ నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమంలో నవని పాల్గొననుంది. చిన్న వయసులో ఢిల్లీ స్థాయిలో గుర్తింపు పొందిన నవనిని అందరూ అభినందిస్తున్నారు.

ముడుపులిస్తేనే మోక్షం..!

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ప్రతి పనికీ ఓ రేటు పెట్టారు. మాన్యువల్ డెత్ సర్టిఫికెట్ నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వరకు డిమాండ్‌ను బట్టి వసూలు చేస్తుంటారు. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పైసలు లేకుండా ఏవైనా సర్టిఫికెట్లు, పత్రాలు తీసుకోవడం కుదరదనే విమర్శలున్నాయి. సర్వే కోసం వెళ్లినా ముడుపులు చెల్లించాల్సిందే. డైక్లాట్‌లో వివరాల కోసం పైసలు ముట్టజెప్పాల్సిందే. ఇలాంటి పనులకు ఎంతో కొంత ఇస్తే చాలు పనైపోతుందని సామాన్యులు సైతం అంటున్నారంటే పరిస్థితి ఎంత ముదిరిపోయింతో అర్థం చేసుకోవచ్చు. ఇక సబ్ డివిజన్ చేసుకోవాలంటే సర్వేయర్‌ను, రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకోవడం సామాన్యుడికి తలకు మించిన భారం అవుతోంది. ఉన్నతాధికారులకు ఈ వ్యవహారం తెలిసినా చర్యలు తీసుకోకపోవడం వల్లనేమరింత రెచ్చిపోతున్నారన్న విమర్శలున్నాయి.

సబ్ డివిజన్ చేయాలన్నా..

సబ్ డివిజన్ కోసం అధికారులకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే. జిల్లా అంతటా అన్ని మండలాల్లో ఇదే వ్యాపారం సాగుతోంది. గార్లదిన్నె తహసీల్దారు కార్యాలయంలో అంతా తానై వ్యవహరిస్తున్న ఓ అధికారి సబ్‌డివిజన్ కోసం పెద్దగానే డిమాండ్ చేస్తున్నారట. ఆ మండలంలోని శిరివరం గ్రామానికి చెందిన షబ్బీర్ అలీ సబ్‌డివిజన్ కోసం తహసీల్దార్ కార్యాలయం వెళ్లాడు. శిరివరంలోని సర్వే నెంబరు 217లో 3.50 ఎకరాల భూమిని ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా గతంలో మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించి, పాస్‌బుక్కు అందజేశారనేది బాధితుని ఆరోపణ. ఈ నేపథ్యంలో కోర్టు పరిధిలో ఉన్న 3.5 ఎకరాలు మినహాయించి తమకు చెందిన 14 ఎకరాలు సబ్ డివిజన్ చేయాలని కోరాడు. ఇందుకు సంబంధిత అధికారి రూ.2లక్షలు ఇస్తే సబ్‌డివిజన్ చేస్తానని హామీ ఇచ్చారట. దీంతో తన భూమి సబ్ డివిజన్‌కు అంత ఇచ్చుకోలేనని వెనక్కువచ్చేశాడట. మరోసారి అడిగినా ఆయన అదే విషయం చెబుతూ అది కాకపోతే ప్రత్యర్థి వర్గానికి ఎకరా భూమి రాసివ్వాలని బేరం పెట్టారట.

బోగస్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో...

షబ్బీర్‌కే చెందిన కల్లూరులోని రూ.50లక్షల విలువైన 6 సెంట్ల స్థలాన్ని కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జూన్ 4న పామిడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ చేశారు. అయితే ఇది అక్రమమని బాధితుడు సబ్‌రిజిస్ట్రార్‌ను కలిశాడు. తాను వంశవృక్షం చూసి ఇచ్చానని పామిడి సబ్‌రిజిస్ట్రార్ చెప్పుకొచ్చారట. ఇదే విషయంలో గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం అధికారులు జూన్ 13న ఎఫ్ఎంసీ జారీ చేయడం గమనార్హం. సంబంధిత వ్యక్తులకు ఇచ్చిన ఫ్యామిలీ సర్టిఫికెట్ నకిలీదని బాధితుడు ఆరోపిస్తున్నాడు. స్థలం బాధితుడి పెదనాన్న ఇమాంసాబ్‌ది. ఆయన మృతి చెందాడు. ఆయన మొదటి భార్య హాఫీజాబీ కొడుకు పెద్దావలి. అంతే. కానీ అవతలివారు రెండో భార్యగా షేక్ మస్తాన్‌బీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో సృష్టించారు. రెండో భార్య ఉన్నది వాస్తవమే అయితే ఆధార్‌లో, ఎఫ్ఎంసీలో, వంశవృక్షంలో తేడాలుండటం నకిలీదని స్పష్టం చేస్తోంది. దీనికితోడు ఇమాంసాబ్ పేరు కూడా తప్పుగా ఉంది. ఆధార్‌లో షేక్ మస్తాన్ బీ భర్త ఎస్.ఇమామూలు అని ఉంది. గార్లదిన్నె మండల అధికారులు ఇచ్చిన ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో షేక్ మస్తాన్‌బీ భర్త వై.ఇమాంసాబ్ అని ఉంచారు. ఇక వంశవృక్షంలో వై.మస్తాన్‌బీ భర్త వై.ఇమాంసాబ్‌గా ఉంది. ఇంత గందరగోళం ఉంటే గార్లదిన్నె తహసీల్దార్ పేరుతో ఆ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారనేది సందేహాలకు తావిస్తోంది. అదేవిధంగా ఆన్‌లైన్ మ్యుటేషన్‌లోనూ వై.మస్తాన్‌బీ భర్త వై.ఇమాంసాబ్‌గా ఉంది.

డబ్బులు అడుగుతున్నారు: షబ్బీర్ అలీ



సర్వేనెంబరు 217లో 3.5ఎకరాలు ఆక్రమించారు. 14ఎకరాలు సబ్‌డివిజన్ చేయమంటే రెవెన్యూ అధికారులు డబ్బులు అడుగుతున్నారు. కల్లూరులోని ఆరు సెంట్లలోనూ అక్రమ రిజిస్ట్రేషన్ జరిగింది. ఆధారాలు లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు. నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సైతం రిజిస్ట్రేషన్ అయ్యాక ఎలా ఇచ్చారు. అందులోనూ అన్నీ తప్పులే ఉన్నాయి. అధికారులు ఇది గమనించలేరా..?

సమస్యల గురుకులం...!

● వేధిస్తున్న తరగతి గదుల కొరత
● ఆరు బయటే స్నానాలు, భోజనాలు
● కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు
● ఇబ్బందుల్లో విద్యార్థులు

గార్లదిన్నె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల అసౌకర్యాలకు నిలయంగా మారింది. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం మూడో రోడ్డులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలను భవనాల కొరతతో గార్లదిన్నెకు మార్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం నిర్మించిన భవనంలోకి 2016లో దీన్ని తరలించారు. మైనార్టీ గురుకుల పాఠశాల భవనం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రాప్తాడు సమీపంలో 6.72 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అలాగే భవన నిర్మాణం కోసం రూ. 17 కోట్లు మంజూరు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ మైనార్టీ గురుకుల పాఠశాలకు సొంత భవనం సమకూరకుండా ఉంది. ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతుండ టంతో ఈ భవనం విద్యార్థులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో సుమారు 400 పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 12 గదులు మాత్రమే ఉన్నాయి. అవి కూడా చిన్న విస్తీర్ణంతో ఉండటంతో పగలు తరగతి గదులుగా... రాత్రి పడక గదులుగా వినియోగించుకుంటున్నారు. విద్యార్థుల సామగ్రి కూడా అదే గదులలోనే నిల్వ ఉంచడంతో గదులు పూర్తి ఇరుకుగా మారాయి. మరుగుదొడ్లు, స్నానపు గదుల కొరత తీవ్రంగా ఉంది. భోజనశాల, వంట గదులు అసలే లేవు. దీంతో విద్యార్థులు తమ అన్ని పనులను ఆరుబయటే కానిస్తున్నారు. ఇరుకు గదుల్లో ఎక్కువ మంది ఉండటం వల్ల సీజనల్ వ్యాధుల తొందరగా ప్రబలుతున్నాయి. పర్యవేక్షణకు వచ్చిన అధికారులతో సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎన్ని సార్లు ఆవేదన వ్యక్తం చేసినా ఫలితం శూన్యం.

పట్టించుకోని పాలకులు, అధికారులు

మైనార్టీ గురుకుల పాఠశాలను పలుమార్లు అధికారులు, పాలకులు సందర్శించడమే తప్ప దాని అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పాఠశాలను సందర్శించిన ప్రతిసారీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రగల్భాలు పలకడం తప్ప చేసిందేమీ లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ పిల్లలకు మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఆరుబయటే స్నానాలు చేస్తున్న విద్యార్థులు





తలుపులు లేని మరుగుదొడ్లు



ఆరుబయటే భోజనం చేస్తున్న విద్యార్థులు

అన్నీ గదులలోనే...



పాఠశాలలో సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చదువుకునే గదులలోనే నిద్రపోతున్నాం. అదే గదిలోనే సామగ్రి పెట్టుకుంటున్నాం. ఒకే గదిలో చదువు, నిద్ర, సామగ్రి అంటే ఇబ్బందిగా ఉంది. దీంతో పగలు తరగతి గది...రాత్రి పడక గదిలా గడుపుతున్నాం. ఒక్కో గదిలో 70 నుంచి 80 మంది ఉంటున్నాం.

-ఎల్లప్ప, విద్యార్థి పదో తరగతి, పత్తికొండ

గదుల కొరత తీవ్రంగా ఉంది



పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. ఈ పాఠశాలలో అన్ని సమస్యలే. చదువుకోవాలన్న, నిద్రపోవాలన్న తీవ్ర ఇబ్బందులు పడు తున్నాం. భోజనం చేసేందుకు గదిలేకపోవడంతో ఆరుబయటే తింటున్నాం. వర్షం వస్తే తడుస్తు భోజనం చేయాలి. గురుకుల పాఠశాలకు వచ్చిన ప్రతి ఒక్కరికి సమస్యను చెబుతున్నా ఫలితం లేదు. గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించి విద్యార్థుల చదువుకు సహకరించాలి.

- షెక్షా, విద్యార్థి డోన్

మా సమస్య పరిష్కరించే నాథుడే లేడు



మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే నాథుడే లేడు. ఐదో తరగతి నుంచి మైనార్టీ గురుకుల పాఠశాలలోనే చదువుకుంటున్నాం. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నా. అధికారులు, నాయకులు వస్తారు. పాఠశాలను సందర్శిస్తారు. అయితే సమస్యలను మాత్రం పరిష్కరించిన పాపన పోలేదు. అధికా రులు, నాయకులు స్పందించి మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. - హరివాజ్ విద్యార్థి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మైనార్టీ గురుకుల పాఠశాలలో తరగతి గదుల కొరత ఉన్న విషయం వాస్తమే. విద్యార్థులకు భవనం సరిపోవడంలేదు. భనవంలో 12 గదులు మాత్రమే ఉన్నాయి. గదుల కొరత ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవలే 6 బాతురూంలు నిర్మించాం. ఒక స్టేజ్ నిర్మించాం. మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కరిస్తామంటున్నారు.

-ఆంజనేయులునాయక్, ప్రిన్సిపాల్, మైనార్టీ గురుకుల పాఠశాల





నీకు నేను.. నాకు నీవు రక్ష

నేడు రాఖీ పౌర్ణమి

అనంతపురం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దూరం పెరిగినా, కాలం మారినా, ఎన్నటికీ చెరగనిది, తరగనిది అన్నాచెల్లెళ్ల అనుబంధం. ఒకరికి ఒకరు అండగా ఉన్నామనే ధీమానిచ్చే బంధం. సోదర బంధానికి గుర్తుగా జరుపుకునే పండుగ రాఖీ. కులమతాలకు అతీతంగా సోదర సోదరీమణులు రాఖీ పౌర్ణమిని జరుపుకుంటారు. శనివారం రాఖీ పౌర్ణమి నేపథ్యంలో తమ సోదరులకు రాఖీలను కట్టేందుకు సోదరీమణులు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రాఖీ కొనుగోలుదారులతో దుకాణాలు సందడిగా మారాయి.



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు, మహిళలు

కులమతాలకు అతీతమైన వేడుక



సమాజంలో కులమతాలకు అతీతంగా జరుపుకునే వేడుక రాఖీ పండుగ. అందుకే అన్నివర్గాల వారికి భరోసా కల్పిస్తూ ప్రజాపిత బ్రహ్మకుమారీలంతా కలిసి రాఖీలు కట్టి ఆత్మీయతను పంచుకుంటున్నాం. ప్రపంచమంతా ఒకే కుటుంబం లాంటిదని మన పురాణాలు చెబుతున్నాయి. అందుకే రాఖీ పండుగను కేవలం భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం.

- శారద, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం

ఉద్యాన పంటల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి

● ఎన్‌హెచ్‌బీ ఎండీని కోరిన ఎంపీ అంబికా



ఎన్‌హెచ్‌బీ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం, ఆగస్టు 8(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రత్యేక తోడ్పాటును అందించాలని జాతీయ ఉద్యాన బోర్డు (ఎన్‌హెచ్‌బీ) ఎండీ ప్రియరంజన్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌బీ ఎండీని శుక్రవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఎంపీ అంబికా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిపై ఎండీకి ఆయన వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యాన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.505 కోట్లలో దాదాపు రూ.300 కోట్లు విడుదల చేయలేదన్నారు. అయితే రాష్ట్రంలో ఇప్పటికే కుప్పంలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఈఓ) ను అనుసరించి చిత్తూరు జిల్లా కుప్పంతోపాటు పల్నాడు, అరకు ప్రాంతాల్లో కొత్తగా సీఈఓలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో అనంత జిల్లాలో అరటి, బొప్పాయి, చీనీ, దానిమ్మ, జామ, సపోట, టమోటా తదితర ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని ఎండీని ఎంపీ కోరారు. రైతులకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్‌లు, పోస్ట్ హార్వెస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లతోపాటు పెండింగ్ ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతి ఇవ్వాలన్నారు. రైతులకు మార్కెట్ లింకేజీలు, విలువ జోడింపు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల అభ్యున్నతి, ఉద్యాన రంగ అభివృద్ధిపై మరింత చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు.

'సూపర్ స్పెషాలిటీ'లోనూ అత్యవసర సేవలు

అనంతపురం వైద్యం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కూడా అత్యవసర సేవల(ఎమర్జెన్సీ) విభాగాన్ని ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 11నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. అందుకు తగిన వైద్య సిబ్బంది, సహాయక సిబ్బంది, అవసరమైన సదుపాయాలు సమకూర్చి 24గంటలూ నిరంతరాయంగా సేవలందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

షట్లర్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. నేషనల్ స్పోర్ట్స్‌ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అండర్-19బాలుర విభాగంలో శ్యామ్‌నాథ్, రిహాన్, నివాస్, ఇషాన్, తలాహా ఎంపికయ్యారు. బాలికల విభాగంలో మౌనిక, రిధి, ఇంద్రాణి, గుణసాయి. ఇందు, సాస్మిక, హారిక ఎంపికయ్యారు. వీరు తిరుపతిలో ఈనెల 12న జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో శాప్ కోచ్ నరేష్‌కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన షట్లర్లు



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 771 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.37

అనంతపురంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.20, సరాసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,300 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

డాక్టర్ వీకే గోకాక్ (జయంతి)



కన్నడనాట గర్వించదగిన సాహితీవేత్త, 'పద్మశ్రీ' గ్రహీత వినాయక కృష్ణ గోకాక్ (వీకే గోకాక్) 1909 ఆగస్టు 9న కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా సవణూరులో జన్మించారు. కన్నడ వరకవి డీఆర్ బేంద్రె మార్గదర్శకత్వంలో సాహిత్యంపై మక్కువతో ముందుకు సాగారు. ఐదో జ్ఞానపీఠ పురస్కారం పొందిన కన్నడిగుడు. 'భారత సింధు రశ్మి' పుస్తకానికి 1990లో పురస్కారం దక్కింది. అంతేకాక ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో ఏ-గ్రేడ్‌లో ఉత్తీర్ణులైన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం, గౌరవడాక్టరేట్‌లు అందుకున్నారు. కాగా బెంగళూరు విశ్వవిద్యాలయం, పుట్టపర్తిలోని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్‌కు వైస్ - ఛాన్సెలర్‌గా వ్యవహరించారు. 1992 ఏప్రిల్ 28న కన్నుమూశారు.

రేలంగి (జయంతి)



ఇంటిపేరుతోనే గుర్తింపు పొందిన రేలంగి వెంకటరామయ్య 1910 ఆగస్టు 9న తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జన్మించారు. తెలుగులో పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనదైన ప్రత్యేకతను చాటుకుని 'రేలంగి'గా పేరొందారు. శ్రీకృష్ణ తులాభారం సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. నేపథ్య గాయకుడిగా కూడా రాణించారు. మిస్సమ్మ, దొంగరాముడు, అప్పు చేసి పప్పుకూడు, లవకుశ తదితర హిట్ సినిమాలలో నటించారు. 1975 నవంబరు 26న కన్నుమూశారు.

వైట్నీ హూస్టన్ (జయంతి)



అమెరికాకు చెందిన ప్రముఖ గాయని వైట్నీ ఎలిజబెత్ హూస్టన్ 1963 ఆగస్టు 9న జన్మించారు. 1977 నుంచి గాయనిగా, నటిగా, మోడల్‌గా, సినీ నిర్మాతగా రాణించారు. ప్రపంచవ్యాప్తంగా ఆమె ఆల్బమ్స్ 200 మిలియన్ రికార్డ్స్‌తో అమ్ముడై ఒక రికార్డుగా నిలిచింది. ఆమె పాడిన 'ఐ విల్ ఆల్వేస్ లవ్ యూ' పాటకు గ్రామీ అవార్డ్ దక్కింది. ఒక గాయని పాడిన పాట ప్రపంచ వ్యాప్తంగా 2 కోట్లకుపైగా కాపీలు అమ్ముడుకావడం విశేషం. 2 ఎమ్మీ అవార్డులు, 8 గ్రామీ, 14 వరల్డ్ మ్యూజిక్ అవార్డులు, 15 గిన్నిస్ వరల్డ్‌రికార్డ్స్, 16బిల్‌బోర్డ్ మ్యూజిక్ అవార్డులు, 22 అమెరికన్ మ్యూజిక్ అవార్డులు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2012 ఫిబ్రవరి 11న కన్నుమూశారు.

యల్లాప్రగడ సుబ్బారావు (వర్ధంతి)



దేశానికి చెందిన వైద్య శాస్త్రజ్ఞులలో చాలా ప్రసిద్ధి చెందిన వ్యక్తి 1895 జనవరి 12న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. లెడర్లీ ప్రయోగశాలలో వైద్యబృందం నాయకులుగా ఫోలిక్ ఆమ్లం యొక్క నిజరూపాన్ని కనుగొన్నాడు. స్ప్రూ వ్యాధి, సైటిక్ ఎనీమియా అనే రక్తహీనతకు అద్భుతమైన మందుగా నిర్ధయించబడింది. అలాగే క్షయ రోగ నివారిణి కోసం బసోనికోటి నికాసిడ్, బోదకాలు టైఫాయిడ్‌లకోసం హైడ్రాక్సైడ్ వంటి మందులను కొనుగొన్నారు. బోదకాలు, టైఫాయిడ్, పాండురోగం తదితర వ్యాధులను నిర్మూలించగల మందులను కొనుగొన్నారు. 1948 ఆగస్టు 9న అమెరికాలో కన్నుమూశారు.

మహేశ్‌బాబు (పుట్టినరోజు)



టాలీవుడ్‌లో ప్రిన్స్‌గా పిలవబడే నటుడు ఘట్టమనేని మహేశ్ బాబు 1975 ఆగస్టు 9న చెన్నైలో జన్మించారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. ఒక్కడు, పోకిరి, సరిలేరు నీకెవ్వరు వంటి సినిమాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. 8నంది అవార్డులు, 5 ఫిల్మ్‌ఫేర్, 3 సినీ'మా', 3 సంతోషం అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. తల్లిదండ్రులు, భార్య కూడా సినీరంగంలో పేరొందారు. కాగా ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దీపా కర్మాకర్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత, జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ 1993 ఆగస్టు 9న త్రిపుర రాష్ట్రం అగర్తలలో జన్మించారు. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని సాధించిన తొలి మహిళా జిమ్నాస్ట్‌గా గుర్తింపు పొందారు. 2015 వరల్డ్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్ షిప్‌లోనూ, రియోడిజనీరోలో జరిగిన 2016 సమ్మర్ ఒలిపింక్స్‌లోనూ పాల్గొన్నారు. 2018లోనూ జిమ్నాస్ట్ పోటీలలో గోల్డ్‌మెడల్ సాధించారు. రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు పొందారు.

హిందూపురం హెచ్‌సీఎల్ జట్టు గెలుపు

మడకశిర టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఎంఎస్ఆర్-జీటీఎస్ టీ20 లెదర్ బాల్ క్రికెట్ టోర్నీలో హిందూపురం హెచ్‌సీఎల్ జట్టు విజయం సాధించింది. శుక్రవారం మొదటి మ్యాచ్‌లో మడకశిర బీస్ట్ జట్టు, హిందూపురం హెచ్‌సీఎల్ జట్టు తలపడ్డాయి. బీస్ట్ జట్టు 18.3 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ కాగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హెచ్‌సీఎల్ జట్టు 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. అభిమన్యు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, సీఐ నాగేష్ బాబు హాజరయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగేంద్ర, న్యాయవాది రాధాకృష్ణ, డాక్టర్ క్రిష్ణమూర్తి, కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.



ఆలంబగిరిపై అమ్మవారికి పూజలు



సామూహిక వ్రతంలో పాల్గొన్న మహిళలు



రణబేరమ్మ మూలవిరాట్టు

వరమహాలక్ష్మీ.. పాహిమాం..!

- ఆలంబగిరిపై సామూహిక వరమహాలక్ష్మిపూజ
- ఇంటింటా కొలువుదీరిన అమ్మవారు



వేర్వేరు ఇళ్లలో కొలువుదీరిన లక్ష్మీదేవి



బాగేపల్లిలోని ఓ ఇంట్లో లక్ష్మీదేవికి పూజలు



అష్టలక్ష్మీదేవతలు, విజయపురలో ఓ ఇంట్లో పూజలు

చింతామణి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రసిద్ధ ఆలంబగిరిపై కొలువైన లక్ష్మీవెంకటరమణస్వామి దేవస్థానంలో వరమహాలక్ష్మి సామూహిక వ్రతం పూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. సర్వాలంకృత పీఠంపై లక్ష్మి అమ్మవారిని కొలువుదీర్చారు. పాల్గొన్న ముత్తైదువులకు కైవార యోగినారేయణ మఠం ఆధ్వర్యంలో పూజాసామగ్రి అందచేశారు. అర్చకబృందం లక్ష్మీ అష్టోత్తరం చదువుతుండగా ముత్తైదువులు ఆశీనులైన చోటునే కుంకుమార్చన చేశారు. సభా ప్రార్థన, విశ్వక్సేన పూజ, కళశారాధన, పీఠపూజ, ద్వారపాలకపూజ, ప్రాణ ప్రతిష్ఠ, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాల్లో కైవారక్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు పాల్గొన్నారు.

రణబేరమ్మ ఆలయంలో విశేషపూజలు

ముళబాగిలు: పట్టణంలో పురాణ ప్రసిద్ధమైన రణబేరమ్మ ఆలయంలో వరమహాలక్ష్మి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం విశేషపూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్టుకు, అష్టలక్ష్మి దేవతలకు పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. రణబేరమ్మ ఉత్సవమూర్తి ప్రాకారోత్సవం సంప్రదాయంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బిందుమాధరావ్ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ముత్తైదువులు ఉపవాసంతో నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని తోరణాలతో ముస్తాబు చేశారు. భక్తులు భక్తిగీతాలను ఆలపించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయపురలో..

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో వరమహాలక్ష్మి పండుగ వాతావరణం ఇంటింటా నెలకొంది. ఇంటిముంగిట రంగవల్లులు వేసి ఇంటిల్లిపాదీ నూతనవస్త్రాలు ధరించి పండుగను ఆచరించారు. ఇళ్లలో లక్ష్మీదేవి విగ్రహం లేదా చిత్రపటం, కళశాన్ని కొలువుదీర్చి పూజలు చేశారు. బంధుమిత్రులకు పసుపుకుంకుమ, తాంబూలాలు అందచేశారు.

బాగేపల్లిలో..

బాగేపల్లి: శ్రావణమాసం అంటే పండుగలు కోకొల్లలు. పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం వరమహాలక్ష్మి పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్ల ముంగిట స్వచ్ఛపరిచి రంగవల్లులు వేసి కుటుబీకులంతా నూతన వస్త్రాలు ధరిస్తారు. అందమైన పుష్పాలతో ఇంటిని అలంకరిస్తారు. మహాలక్ష్మి దేవికి శక్త్యానుసారం నైవేద్యాలు సమర్పించి బంధుమిత్రులకు ఇస్తారు. వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటారు ఇలా ఎటుచూసినా సందడి నెలకొంది.

కాళికాంబ ఆలయంలో...



కాళికాంబ అమ్మవారు..

శిడ్లఘట్ట: వరమహాలక్ష్మి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని కాళికాంబికా కొమ్మటేశ్వర ఆలయంలో శుక్రవారం విశేషపూజలు జరిగాయి. ఆలయశుద్ధి అనంతరం సంప్రదాయం ప్రకారం మామిడి తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పురసభలో కేడీపీ సమావేశం



కేడీపీ సమావేశంలో ఎమ్మెల్యే శివణ్ణ తదితరులు

దొమ్మసంద్ర, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పురసభ కార్యాలయం సభాంగణంలో కేడీపీ సమావేశం నిర్వహించగా అన్నిశాఖల అధికారులు పాల్గొని కార్యక్రమాల ప్రగతిని వివరించారు. ఆనేకల్ ఎమ్మెల్యే శివణ్ణ అధ్యక్షత వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. సాంఘికసంక్షేమ అధికారులు తాలూకాలోని హాస్టళ్లను తరచు సందర్శించాలని, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో వందశాతం నమోదు సాధించేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఆనేకల్ తాలూకాలో 512 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను 307 అంగన్‌వాడీలకు సొంత భవనాలు ఉన్నాయని, మిగిలినవాటికి సొంత భవనాలు నిర్మించేలా సీఏ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసారి వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో వ్యవసాయ, పట్టుశాఖ అధికారులు రైతుల సమస్యలపై దృష్టి పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. సర్జాపురలో పశువుల ఆసుపత్రి నిర్మాణమైందని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. తాలూకాలో రూ.17కోట్లతో నిర్మిస్తున్న అంబేడ్కర్ భవనం రెండు నెలల్లో పూర్తి కావాలన్నారు. అదనపు గ్రాంట్లు సాధించినా ప్రజాపనులశాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తళి రోడ్డు విస్తరణకోసం ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి, గ్యారెంటీ పథకాల తాలూకా సమితి అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, తహసీల్దార్ శశిధర్ మడ్యాళ్ తాలూకా పంచాయతీ ఈఓ భైరప్ప, తహసీల్దార్ కరియనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంపీపీ పరిశ్రమ స్థాపనకు కీలక ఒప్పందం



ఒప్పందంలో ఎస్ఎంపీపీ సీఈఓ అశిష్ కన్సాల్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మేక్ ఇన్ ఇండియా మేక్ ఫర్ ది వరల్డ్ పరికల్పనలో భాగంగా ప్రముఖ రక్షణ సాంకేతిక కంపెనీ ఎస్ఎంపీపీతో కలసి పరిశ్రమ స్థాపించేందుకు ఫిలిప్పీన్స్ ఏషియా డిఫెన్స్ అండ్ ఫైర్‌పవర్ కార్పొరేషన్ కలక ఒప్పందం చేసుకుంది. బెంగళూరులో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంపీపీ సీఈఓ అశిష్ కన్సాల్ మాట్లాడుతూ ఒప్పందం ద్వారా స్వదేశీ సాంకేతికత ఉత్పత్తులు విదేశాలలో విస్తరించేందుకు అనుకూలం కానుందన్నారు. ఫిలిప్పీన్స్‌కు రక్షణా వ్యవస్థలో సహకారం అందిసామన్నారు. ఏడీఎఫ్‌సీఏ చైర్మన్ సీఈఓ జెరుయల్ డీ సాంచేజ్ మాట్లాడుతూ ఒప్పందం ద్వారా ఫిలిప్పీన్స్ ఆయుధాల విభాగంలో అత్యాధునిక రక్షణ సాంకేతికత సాధ్యం కానుందని, ఇదో మహత్తరమైన ఒప్పందంగా భావిస్తామన్నారు.

మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమే

- సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ఆర్ఎస్ భట్టి



ప్రతిభావంత విద్యార్థులతో సీఐఎస్ఎఫ్ అధికారులు తదితరులు

హొస్కోటె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని సీఐఎస్ఎఫ్‌కు చెందిన డీజీ ఆర్ఎస్‌భట్టి అభిప్రాయపడ్డారు. ఎంపవర్ సహకారంతో సీఐఎస్ఎఫ్‌కు చెందిన ప్రాజెక్ట్ మన్‌లో భాగంగా 75వేలమందికిపైగా సిబ్బందికి కౌన్సెలింగ్ సేవలకు సాధ్యమైందన్నారు. ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు అధ్యక్షురాలు నీర్జా బిర్లాతో కలసి ప్రాజెక్టు స్థితిగతులపై సమీక్ష చేశారు. 2024, 2024లో సీఐఎస్ఎఫ్ లో ఆత్మహత్యల ప్రమాణం జాతీయ సరాసరికంటే తక్కువగా ఉందని గుర్తించారు. గత మూడేళ్లలో ప్రాజెక్ట్‌మన్ దేశవ్యాప్తంగా సీఐఎస్ఎఫ్ విభాగాలలో సైకోమెట్రిక్ స్క్రీనింగ్, కౌన్సెలింగ్, పీర్ ఎంగేజ్‌మెంట్, 24/7 సహాయవాణి వంటి వాటి ద్వారా 75వేలమందికిపైగా ప్రయోజనం పొందారన్నారు. దైనందిన జీవితంలోనూ మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు అవసరమైన కౌన్సెలింగ్ అవసరమన్నారు. తద్వారా ఆత్మహత్య వంటివి 40శాతం తగ్గాయన్నారు. ఏబీఈటీ 1,726మందికి మానసిక అంశాలపై తర్ఫీదు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభావంత విద్యార్థులకు మెడల్స్ అందచేసి ప్రశంసించారు.

విష్ణువర్ధన్ స్మారకం నేలమట్టం



విష్ణువర్ధన్ స్మారకం తొలగించాక, తొలగించక ముందు..

బెంగళూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కన్నడ సినిమారంగంలో దిగ్గజనటుడిగా పేరొందిన సాహససింహ డాక్టర్ విష్ణువర్ధన్ స్మారకాన్ని గురువారం రాత్రికి రాత్రే నేలమట్టం చేశారు.

అభిమానుల ఆగ్రహం

నగర శివారులోని కంగనహళ్ళి వద్ద ఉండే ఆమె అభిమాన్ స్టూడియోలో విష్ణు స్మారకాన్ని నేలమట్టం చేశారు. బాలణ్ణ కుటుంబం, విష్ణువర్ధన్ అభిమానుల మధ్య ఇదే విషయమై వాగ్వాదం జరిగింది. కొన్నేళ్లుగా విష్ణు స్మారకం వద్ద వర్ధంతి జరిపే అవకాశం లేకుండా చేశారు. హైకోర్టు సూచన మేరకు అభిమాన్ స్టూడియలో ఉన్న స్మారకాన్ని రాత్రికి రాత్రి తొలగించేశారు. దీంతో విష్ణువర్ధన్ అభిమానులు ప్రభుత్వ, పోలీసుశాఖ, చలనచిత్ర వాణిజ్యమండలి తీరును తప్పుబట్టారు. 35ఏళ్లపాటు కన్నడ సినిమారంగంలో కొనసాగి 200కుపైగా సినిమాలలో నటించిన విష్ణువర్ధన్ అభిమానులకు ఈ సంఘటన తీవ్ర నిరాశ కలిగించిందని పలువురు అభిప్రాయపడ్డారు. విష్ణువర్ధన్ అంత్యక్రియలు కెంగేరిలోని అభిమాన్ స్టూడియో ప్రాంగణంలో జరిపారు. ఆ తర్వాత విష్ణు సమాధిని రక్షించి అదే ప్రాంతంలోనే స్మారకంగా తీర్చాలని పోరాటం సాగుతోంది. కానీ ఇటీవల ప్రభుత్వం మైసూరులో విష్ణువర్ధన్ స్మారకాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగానే స్థానికంగా ఉండే స్మారకాన్ని తొలగించారు.

సాయంత్రం ఓపీడీ రోగులకు అనుకూలం

బెంగళూరు, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఆసుపత్రులలో ఉదయం వేళ మాత్రమే ఓపీడీ సేవలు ఉంటాయని, సాయంత్రం కూడా కొనసాగించడం రోగులకు అనుకూలమని పద్మభూషణ్ గ్రహీత అనంత్‌నాగ్ అభిప్రాయపడ్డారు. మెడికవర్ ఆసుపత్రిలో ఈవెనింగ్ ఓపీడీ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంత్‌నాగ్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఆరోగ్య సమస్యలు అధికమన్నారు. సాయంత్రమైతే విద్యార్థులు, ఉద్యోగులకు ఓపీడీ ద్వారా సేవలు అనుకూలం కానున్నాయన్నారు. పీడియాట్రిక్స్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్ విభాగాల వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. మెడికవర్ ఆసుపత్రి రీజనల్ డైరెక్టర్ నీరజ్‌లాల్, ఆసుపత్రి చీఫ్ కృష్ణమూర్తితోపాటు వైద్యనిపుణులు పాల్గొన్నారు.

యువకుల ఆసక్తి అభినందనీయం

- సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన యువకులు

రాయచూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రదేశాన్ని కన్నవారిని వదలి దేశరక్షణ కోసం సిద్ధమైన యువకుల ఉత్సాహం అభినందనీయమని రాయచూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ అన్నారు. దేశ రక్షణ కోసం యువత ఉత్సాహంగా ముందుకు రావడం హర్షదాయకమన్నారు. అగ్నివీర్ నియామకం కోసం చేపడుతున్న దేహధారుఢ్య పరీక్ష ర్యాలీ శుక్రవారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో ప్రారంభమైంది. నియామక ర్యాలీని ప్రారంభించిన సిటీ ఎమ్మెల్యే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్సాహంగా తరలి వచ్చిన యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా సైన్యంలో ఎంపిక కోసం రాయచూరును వేదికగా చేసుకోవడం గర్వకారణమన్న సిటీ ఎమ్మెల్యే, వసతి, భోజన ఏర్పాట్లకు ఎలాంటి లోటు లేకుండా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కోరారు.


ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్

మడకశిర రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడుగుంట అంజనేయస్వామి ఆలయాల కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ వెలువడినట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను 25వ తేదీలోపు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషర్ కార్యాలయానికి పంపించాలని ఆయన సూచించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.50
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	33,000	57,819
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	32,488	59,839
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	103.58



అంజనాద్రి బెట్ట

అంజనాద్రి వివాదంలో కొప్పళ డీసీకి సుప్రీం నోటీసులు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):గంగావతి తాలూకా అంజనాద్రి బెట్టలో వెలసిన ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారికి నిర్వహించే పూజకు సంబంధించి నెలకొన్న వివాదం నేపథ్యంలో కొప్పళ జిల్లాధికారి సురేష్ ఇట్నాల్‌కు సుప్రీం కోర్టు నోటీసు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను పాటించలేదన్న కారణంగా డీసీని ఆగస్టు 11వ తేదీన ఆన్‌లైన్‌లో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సుప్రీం కోర్టు తన మధ్యంతర ఆదేశాల్లో అర్చకులు విద్యాదాస్ బాబాకు స్వామి వారికిపూజ చేసే అవకాశం ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొందని, దీంతో పాటు అంజనాద్రి బెట్టపై విద్యాబాస్ బాబాకు మౌలిక సౌకర్యాలు కల్పించేలా గదిని ఏర్పాటు చేయాలని సూచించింది. జిల్లాధికారి సురేష్ హిట్నాల్ అంజనాద్రికి వెళ్ళిన సమయంలో ఆలయంలో మరో వ్యక్తి పూజలు నిర్వహించారు. ఈ విషయంపై విద్యాదాస్ బాబా వ్యతిరేకత వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం హుండీ విషయంలో కూడా విద్యాదాస్ బాబా, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ప్రకాష్ రావ్ మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. వివాదంలో విద్యాదాస్ బాబా సుప్రీం కోర్టును ఆశ్రయించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

12న కళాకారుల ఎంపిక

హోస్పేట, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): సమాచార, ప్రజా సంబంధాల శాఖ ద్వారా వీధి నాటకాలు, జానపద సంగీత బృందాల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి కళా బృందాలను ఎంపిక చేసే ప్రక్రియ ఈనెల 12న ఉదయం 11గంటలకు సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ ధనుంజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న కళాబృందాలు విజయనగరం సమాచార, ప్రజాసంబంధాలశాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరుకావాలన్నారు. ప్రతి వీధినాటక బృందంలో 8మంది కళాకారులు ఉండాలి. ఇందులో షెడ్యూల్డ్ కులం లేదా షెడ్యూల్డ్ తెగకు చెందిన ఇద్దరు మహిళలు, ఒక కళాకారిణి ఉండాలి. ప్రతి జానపద సంగీత బృందంలో 3మంది కళాకారులు ఉండాలి, ఇందులో షెడ్యూల్డ్ కులం, తెగకు చెందిన ఒక కళాకారిణి ఉండాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద వివిధ ప్రాజెక్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ రమేష్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి స్వయం ఉపాధి ప్రత్యేక రుణ పథకం కింద సూక్ష్మ ఆర్థిక కార్యాకాలాపాల కోసం స్వయం ఉపాధి ప్రత్యేక రుణ గొర్రెల పెంపకం పథకం,స్వవలంబి సారథి పథకం కింద వ్యవస్థాపక అభివృద్ధి పథకం, ఫాస్ట్ ఫుడ్ ట్రక్ ట్రైలర్, మొబైల్ కిచెన్ ఫుడ్ కియోస్కులు,పారి పరిశ్రమ, ఇతరప్రయోజనాల కోసం, మహిళా స్వయం సహాయక బృందాల కోసం మైక్రో క్రెడిట్ ప్రోత్సహక పథకం, గంగా కళ్యాణ్‌పథకం, భూమి యాజమాన్య పథకం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభివృద్ధి సంస్థ, దాని అనుబంధ సంస్థ కర్ణాటక ఆదిజాంబవ అభివృద్ధిసంస్థ, కర్ణాటక భోవి అభివృద్ధి సంస్థ, కర్ణాటక రాజ్య సఫాయి కర్మచారి అభివృద్ధి సంస్థ, కర్ణాటక తండా అభివృద్ధి సంస్థ నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి. దరఖాస్తులు సమర్పించడానికి సెప్టెంబర్ 10 చివర తేదీ అన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు సమీపంలోని సేవా సింధు గ్రామ్‌వన్, కర్ణాటకవన్ కేంద్రాలలో మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రూ.145 కోట్లతో మెగా మిల్క్ డెయిరీ

● కొలగల్లు వద్ద ఏర్పాటుకు కేఎంఎఫ్ బోర్డు తీర్మానం ● స్థలాన్ని పరిశీలించిన పాలకులు, అధికారులు ● శంకుస్థాపనకు సీఎం, డీసీఎం

బళ్లారి, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ నియోజకవర్గంలోని కొలగల్లు గ్రామం ఏకలవ్య పాఠశాల సమీపంలోని 15 ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ. 145 కోట్ల తో మెగా మిల్క్ డెయిరీ నిర్మించాలని కేఎంఎఫ్ పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం కొప్పళ ఎమ్మెల్యే రాబకోవి అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాల్, మాజీ మంత్రి నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ నందీష్‌బాబు, ఏడీసీ మహమ్మద్ జుబేరా, కేఎంఎఫ్ డైరెక్టర్ రామకృష్ణ, డైరెక్టర్లు స్థల పరిశీలన చేశారు. అనంతరం హిట్నాళ్ విలేకరులతో మాట్లాడారు. బళ్లారిలో మెగా మిల్క్ డైరీని ఇదే స్థలంలో ప్రారంభిస్తామన్నారు. 2022 నాడు రూ. 135 కోట్ల అంచనాతో బళ్లారి ఏరియాలో మెగా మిల్క్ డైరీ స్థాపనకు అంగీకారం జరిగిందన్నారు. ప్రస్తుతం డైరీ నిర్మాణం వ్యయం అంచనా పెరిగిందన్నారు. రూ.145 కోట్లు అంచనాగా నిర్మించామన్నారు. డెయిరీ శంకుస్థాపనకు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డికే శివకుమార్ హజరవుతారన్నారు. మాజీ మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ మెగా డెయిరీ స్థాపనతో బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు జిల్లా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రోజుకు పాల సేకరణ 3 లక్షల నుంచి 4 లక్షల లీటర్ల వరకూ జరిగే అవకాశం ఉంటుందని, దీంతో పాడి రైతులకు లాభాలు గడించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ బళ్లారిలో మెగా డెయిరీ ఏర్పాటుతో నాలుగు జిల్లాల రైతులకు మేలు జరగనుందన్నారు. కేఎంఎఫ్ ఉపాధక్షుడు ఎన్. సత్యనారాయణ. డైరెక్టర్లు కృష్ణరెడ్డి, ప్రదీప్, బీమన్నగౌడ, మంజు, కరులవ్య, అమర్ . సీతారామలక్ష్మి, చిదానంద, బీమానాయక్, మాజీ డైరెక్టర్ ధనుంజయ, కొత్తపల్లి తిమ్మరాజులు, గుమ్మనూరు జగన్, కాంగ్రెస్ పార్టీ మీడియా కో-ఆర్డినేటర్ నాయకుడు వెంకటేశ్ హేగ్డే, రాష్ట్ర కురుబసంఘం కార్యదర్శి కుడితిని రామాంజనేయులు, తదితరులు హజరయ్యారు.

కేఎంఎఫ్ బోర్డు సమావేశంలో తీర్మానం

స్థల పరిశీలన అనంతరం కేఎంఎఫ్ బోర్డు సభ్యులు అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మెగా డెయిరీ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేశారు. స్థలానికి ప్రభుత్వ రేటు ప్రకారం రూ. 2.5 కోట్లు కేఎంఎఫ్ నుంచి చెల్లించాలని పేర్కొన్నారు. కేఎంఎఫ్ నుంచి డబ్బులు కట్టి స్థలం స్వాధీనం చేసుకుంటామన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కేఎంఎఫ్ పాలక మండలి సభ్యులు

అధ్యక్ష, మాజీ అధ్యక్షుల మధ్య వాగ్వాదం

కేఎంఎఫ్ బోర్డు సమావేశానికి మొత్తం 18 మంది డైరెక్టర్లు హజరయ్యారు. మాజీ అధ్యక్షుడు బీమానాయక్ మెగా మిల్క్ డెయిరీని విజయనగర జిల్లాకు తరలించాలని పట్టుబట్టారు. బళ్లారిలో డెయిరీ తీర్మానాన్ని ఆయన వ్యతిరేకించారు. అయితే 18 మందిలో 14 మంది బళ్లారికే ఆమోదం తెలిపారు. బీమానాయక్‌తో పాటు మరో నలుగురు డైరెక్టర్లు వ్యతిరేకించారు. ఈ విషయంపై హిట్నాళ్, బీమానాయక్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. అధిక సంఖ్యలో ఆమోదించడంతో బళ్లారిలో స్థాపనకే ఆమోదం లభించింది. బీమానాయక్ భంగపాటుకు గురయినట్లు అయ్యింది. బళారిలోనే మెగా డెయిరీ స్థాపనకు తీర్మానం లభించడంతో కథ సుఖాంతం అయినట్లయ్యింది. హిట్నాళ్ ఎన్నికల వేళ ఇచ్చిన హామీని నెరవేర్చినట్లయింది.

భక్తిశ్రద్ధలతో వరమహాలక్ష్మి పూజలు



సువర్ణ ముఖ కవచంతో కనకదుర్గమ్మ

బళ్లారి సిటీ/కంప్లి/సిరుగుప్ప, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వరమహాలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం బళ్లారి కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. దుర్గమ్మను స్వర్ణ ముఖ కవచంతో అలంకరించారు. మూడు రోజుల పాటు అమ్మవారికి ఇదే అలంకరణ కొనసాగనుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని పూజారి గాదెప్ప కోరారు. అమ్మ దర్శనానికి భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. దేవిని వీక్షించిన భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. నగరంలోని అమ్మవారి ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. పటేల్‌నగర్‌లోని చిన్న దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని విశేషఅలంకారంతో విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



చిన్నదుర్గమ్మ



తాయమ్మదేవి



పూజల్లో మహిళలు

దుర్గామాత ఆలయంలో ప్లాస్టిక్ పూలతో అలంకరణ

● దేవదాయ శాఖ అధికారులపై భక్తుల ఆగ్రహం





అమ్మవారి సన్నిధిలో అలంకరించిన ప్లాస్టిక్ హారాలు

బళ్లారి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ అమ్మకాలపై దాడులు నిర్వహిస్తూ, దుకాణదారులను పరుగులు పెట్టించే అధికారులు పవిత్రమైన శ్రావణ శుక్రవారం నాడు బళ్లారి దుర్గామాత ఆలయాన్ని ప్లాస్టిక్ పూలతో అలంకరించడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి నగర ఇలవేల్పుగా భావించే కనకదుర్గమ్మను ఎందరో పవిత్రంగా దర్శించుకుంటారు. అంతటి పవిత్రమైన ఆలయంలో ఇంత నిర్లక్ష్యమా అని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గామాత ఆలయాన్ని పుష్పాలతో అలంకరించడం ఆనవాయితీ. అయితే ఈసారి దేవాయలం చుట్టూ, గర్భగుడి బయట ఫంక్షన్లలో వాడే ప్లాస్టిక్ పూలతో అలంకరించారు. ఎప్పుడ లేనిది ఈ సారి ఎందుకిలా చేశారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లో ఎంతో ఆదాయం వస్తున్నా ఇలా చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అంతే కాక దేవాయలం గర్భగుడి ముందు అలకంరించిన పుష్పాలు కూడా రెండురోజుల ముందు అలకరించినవని భక్తులతో పాటు, దేవదాయ శాఖ సిబ్బంది చెప్పడం గమనార్హం.

యూరియా కొరత తీర్చాలని రైతుల వినతి



తహసీల్దార్ మంజునాథకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కంప్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కంప్లి పట్టణంలో అఖిల కర్ణాటక రాష్ట్ర కిసాన్ జాగృతి సంఘం కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, గ్రీన్ ఆర్మీ నేతృత్వంలో రైతుల నిరసన చేపట్టారు. ఉదయం ఉద్భవ గణేష్ ఆలయం నుంచి పాదయాత్ర చేపట్టి, అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మంజునాథ్, వ్యవసాయ సహాయ డైరెక్టర్ మంజునాథ రెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాదర్ మాట్లాడుతూ యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పంటలను కోల్పోతున్నారని, ప్రభుత్వాలు రైతుల పక్షాన ఉన్నాయని గొప్పలు చెప్పుకుంటున్నాయన్నారు. అఖిల కర్ణాటక రాష్ట్ర కిసాన్ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర, ఉపాధ్యక్షురాలు ఉష, తాలుకా అధ్యక్షులు రామాంజిని, విజయ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు రత్నమ్మ, కర్ణాటక రైతు సంఘం, గ్రీన్ ఆర్మీ జిల్లా అధ్యక్షురాలు బివి గౌడ, తాలుకా వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టూరు రమేష్, రైతు నాయకులు మురారి, గంగన్న, బి హనుమంత, ఉమేష్‌గౌడ, బడిగేర జిలాన్ సాబ్, కరీ నాగప్ప, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నూతన గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే

కంప్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని జీరిగనూరు గ్రామంలో శిక్షణ శాఖ నుంచి నిర్మించిన నూతన గదులను ఎమ్మెల్యే గణేశ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను విద్యార్థులు పుష్పాలతో ఆహ్వానించి ఎమ్మెల్యే అన్న మా గ్రామానికి చేసిన సహాయం మరువలేమంటూ ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల్లో విద్యార్థులకు ఉత్తమ విద్య కల్పించాలని, విద్యాలయాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అంతకుముందు పట్టణంలో గత కొంతకాలంగా శ్యామియా చంద్ నూతన కట్టడాలకు శుక్రవారం భూమిపూజ చేపట్టారు. దేవసముద్రంలో రైతులకు అనుగుణంగా చెక్‌డ్యామ్‌లకు భూమిపూజ చేపట్టారు. కంప్లి పట్టణంలోనే తాలుకా శిక్షణ అధికారి కేంద్రం ఏర్పాటయ్యేలా చేస్తామన్నారు. కంప్లి కోట వద్ద వుండే వంతెన నూతన నిర్మాణం ఏర్పడేందుకు ముఖ్యమంత్రి మంత్రులతో చర్చలు జరిపి నూతన బ్రిడ్జి ఏర్పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస రావు ఏపీఎంసీ అధ్యక్షుడు హబీబుర్ రెహమాన్, సీఆర్ హనుమంతు, రాజ్‌కుమార్, బసవరాజు, శకుంతల, షణ్ముఖప్ప, వెంకోబ, ధనవంతప్ప, బీరలింగప్ప కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గణేశ్‌ను స్వాగతిస్తున్న విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

అరసు జయంతిని ఘనంగా నిర్వహించాలి

● సన్నాహక సమావేశంలో ఏడీసీ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దేవరాజు అరసు జయంతిని ఈనెల 29న జిల్లాకేంద్రంలో ఘనంగా జరుపుకోవాలని అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేర్ అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో దేవరాజ అరసు 110 జయంతి వేడుకల సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో వేదిక కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని, జయంతిని దృష్టిలో ఉంచుకుని రంగమందిరం లోపల, వెలుపల శుభ్రతను పాటించాలన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి వచ్చిన సర్క్యులర్‌లో పేర్కొన్నట్లుగా జిల్లాలోని వెనుకబడిన తరగతుల ప్రీ- మెట్రిక్ ,పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల హాస్టళ్లలో ఆగస్టు 20నుండి డి.దేవరాజ అరసు వ్యక్తిత్వం గురించి నేటి యువజన సమాజానికి సందేశం అందించడానికి జిల్లాలోని వివిధ హాస్టళ్లలో విద్యార్థులకు వ్యాస రచనపోటీలు, ఉపన్యాస పోటీలు, ఇతరపోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుత సంవత్సరంలో పదవతరగతి, పీయూసీ(ఇంటర్) పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీల్లో అత్యధిక మార్కులు సాధించిన బీసీఎం కమ్యూనిటీకి చెందిన విద్యార్థులను గుర్తించి సత్కరించాలని, వెనుకబడిన వర్గాల సంఘం ప్రముఖులకు వేదిక కల్పించాలన్నారు. వివిధ రంగాలలో ప్రత్యుక విజయాలు సాధించిన వెనుకబడిన తరగతుల వ్యక్తులకు జిల్లాస్థాయి దేవరాజు అరసు అవార్డును ప్రదానం చేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న సంస్థ నాయకులు దేవరాజు అరసు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జిల్లా ప్రభుత్వం భూమిని అందించాలని అభ్యర్థించారు. అదనపు జిల్లాకలెక్టర్ స్థలాన్ని గుర్తించమని కోరారు. ఈసందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి జలలప్ప, వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు, జిల్లాలోని వివిధ సంఘాలు , సంస్థల నాయకులు, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

రైతుల నుంచి కమీషన్ తీసుకోరాదు

● మార్కెట్ యార్డు చైర్మన్ కట్టిమనే నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న కట్టిమనె నాగేంద్ర

బళ్లారి సిటీ, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): బ్రోకర్లు, టెండర్‌దారులు, దుకాణ యజమానులు రైతుల నుంచి ఒక్కపైసా కూడా కమీషన్ తీసుకోరాదని మార్కెట్ చైర్మన్ కట్టిమనే నాగేంద్ర ఆదేశించారు. శుక్రవారం మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఇకపై ఎటువంటి సమస్యలను ఎదుర్కోకుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వారం రోజులుగా మూత బడిన మార్కెట్‌లో శుక్రవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంలో రైతు సంఘం అధ్యక్షుడు మాదవరెడ్డి, పాలన్న తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి : డీహెచ్‌ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అధికారులకు సూచించారు. శుక్రవారం సండూర్ తాలూకాలోని చోరనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 9వ తేదిన జరిగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ ప్రచార దినోత్సవం నాడు గర్భిణులు ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. గర్భధారణ సమయంలో, ప్రసవం తర్వాత తీసుకోవాల్సిన సలహాలపై అవగాహన కల్పించాలన్నారు. కనీసం 4సార్లు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని, గర్భధారణ సమయంలో తల్లులకు ప్రమాద సంకేతాల గురించి అవగాహన కల్పించాలన్నారు. వైద్యుల సలహా లేకుండా ఎటువంటి మందులు తీసుకోరాదన్నారు. ఈసందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అక్షయ్, గిరీశ్, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ దినేశ్వర్, ఆశా కార్యకర్తలు, తల్లులు, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ గణాంకాలపై అవగాహన



మొక్కలు నాటుతున్న గణాంక అధికారులు, సిబ్బంది

బళ్లారి సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ గణాంకాలు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న బళ్లారిలోని సబ్-రీజనల్ ఆఫీస్, నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్(ఫీల్డ్ డివిజన్) సహకారంతో నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ నేషనల్ శాంపిల్ సర్వే(ఎన్ఎస్ఓ) 75వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం దమ్మూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం జరిగింది. జాతీయ గణాంక కార్యాలయం సర్వేల ప్రాముఖ్యత ,ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తూ బళ్లారి సబ్ రీజినల్ కార్యాలయం నుండి దమ్మూర్ గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో జాతీయ గణాంక కార్యాలయ అధికారులు సర్వేల ద్వారా జాతీయ ప్రణాళిక, విధాన రూపకల్పనమైన విశ్వసనీయ సామాజికా ఆర్థిక సమాచారాన్ని సేకరించడంలో జాతీయ గణాంక కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయం ,దమ్మూరు వెంకప్ప తాతా మఠం ప్రాంగణంలో చెట్ల పెంపక కార్యక్రమాన్ని నిర్వహించి 200 మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జాతీయ గణాంక కార్యాయం అధికారులు, హుబ్బళ్ళి ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ హరిశ్వరన్, జిల్లా గణాంక అధికారి బత్రిబసప్ప, సీనియర్ గణాంక అధికారులు ,కార్యాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

హిందూపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నా కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులుడిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అయినా కొన్ని విద్యాసంస్థలు తరగతులు నిర్వహించాయన్నారు. ఇలాంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే మేం విద్యాసంస్థల ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ నాయకులు బాబావలి, భగత్‌రాజు, అనుదీప్, నజీర్, మహేష్, తిమ్మరాజు, గంగరాజు పాల్గొన్నారు.

హోసూరు జోన్



కరుణానిధికి నివాళి అర్పిస్తున్న డీఎంకే నాయకులు

కరుణానిధికి ఘన నివాళి

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే మాజీ అధ్యక్షుడు ఎం కరుణానిధి వర్ధంతి సందర్భంగా నాయకులు, అభిమానులు ఘన నివాళులు అర్పించారు. కలైంజర్ విగ్రహానికి పూలమాలల వేశారు. కృష్ణగిరి తూర్పు జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో నిశ్శబ్ధ ర్యాలీ నిర్వహించారు.

బరగూరు ఎమ్మెల్యే మతియజగన్ నేతృత్వంలో మౌన ప్రదర్శన సాగింది. లండన్‌పేట, చెన్నైరోడ్డు, బెంగళూరు రోడ్డు తదితర మార్గాలలో ర్యాలీ సాగింది. పలువురు అభిమానులు, కార్యకర్తలు నల్లచొక్కాలు ధరించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సెంగుట్టవన్, నరసింహన్, మాజీ ఎంపీలు వెట్రిసెల్వన్, సుగవనం, జిల్లామండలి చైర్మన్ నాగరాజ్, నగరమండలి చైర్‌పర్సన్ పరితా నవాబ్ పాల్గొన్నారు.

జనవరి 9న పొత్తు ప్రకటిస్తాం

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

హోసూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రానున్న శాసనసభ ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం అవుతున్నామని 2026 జనవరి 9న పొత్తు గురించి ప్రకటిస్తామని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ వెల్లడించారు. నగరంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి ఎల్‌కే సుతీశ్‌తో కలసి మీడియా సమావేశం జరిగింది. తొలుత విజయకాంత్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పోలింగ్ ఏజెంట్లతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం అనంతరం కామరాజ్, అన్నా వంటి ముఖ్యమంత్రులు విద్యకోసం పనిచేశారన్నారు. ప్రస్తుత సీఎం విడుదల చేసిన రాష్ట్ర విద్యావిధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాక తన అభిప్రాయం వ్యక్తం చేస్తానన్నారు. విద్యావిధానం విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటే తమ పార్టీ స్వాగతిస్తుందన్నారు. కాగా కులం, మతాలకు అతతంగా తమ పార్టీ వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతుందన్నారు. పరువుహత్యలను నియంత్రించేలా ప్రత్యేకచట్టం తీసుకురావాలనేది తమ డిమాండ్‌గా ఉందన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా చర్యలు అవసరమన్నారు. మర్యాదపూర్వకంగా మాజీ మంత్రి కేసీ వీరమణితో భేటీ అయ్యామన్నారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమలత

మాతృ వందనతో తల్లుల ఆరోగ్యానికి రక్షణ

● చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సింధు అంగడి

హోస్పేట,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):మాతృ వందన యోజన తల్లుల ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడుతుందని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సింధు అంగడి అన్నారు. తల్లుల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం క్రమం తప్పకుండా తనిఖీలు చేయించుకునేలా ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం మహిళలకు బహుమతిగా మాతృ వందన పథకాన్ని అందించిందని ఆమె అన్నారు. శుక్రవారం తాలూకాలలోని హలే మలపనగుడి అంగన్‌వాడీ-2 కేంద్రంలో నిర్వహించిన మాతృ వందన శిబిర కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృ వందన యోజన అనేది భానత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ యొక్క కేంద్రప్రయోజిత ప్రధాన పథకంఅన్నారు. ఈపథకం గర్భిణి స్త్రీలు, పాలిచ్చే తల్లులకు మద్దతు ఇవ్వడానికి రుపొందించబడింది. ఇది సమాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు ప్రసూతి సౌకర్యాలను అందిస్తుంది. రూ. 5వేలు ప్రోత్సహకంఅందించబడుతుంది. మాతృవందన పథకం కింద ఇప్పటివరకు రూ.4కోట్లకుపైగా మహిళలు ప్రయోజనం పొందారు.మాతృ వందన యోజన మహిళలపట్ల సానుకూల దృక్పథాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మలపనగుడి గ్రామపంచాయతీ పరిపాలనా అభివృద్ధి అధికారి హనుమంతప్ప కెమ్మార్, అంగన్‌వాడీ కార్మికురాలు మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.